సాక్షి
ములుగు
శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



ఆటల్లో ఆణిముత్యాలు
మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. - 8లో▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగ తనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0⁰ /22.5⁰
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర ధాన్యం తనిఖీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మహేందర్ జీ, సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి గురువారం తనిఖీ చేశారు. పక్క రాష్ట్రం నుంచి ఎలాంటి లారీలు వచ్చినా తనిఖీ చేయాలని సూచించారు. అంతకు ముందు మండల పరిధిలోని ప్రగళ్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో కోతలు లేకుండా చూడాలని ఆయనను రైతులు కోరారు. మొరుమూరు గ్రామం నుంచి గుండ్లవాగు ప్రాజెక్టు వరకు వెళ్లే రహదారి నిర్మాణానికి భూమి అవసరం కాగా ఆ భూమికి సంబంధించిన రైతులతో మాట్లాడారు. వారి వెంట తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, డిటి రాహుల్ చంద్రవర్మ, ఆర్ఐ కుమారస్వామి, ఏఈఓ జాఫర్ తదితరులు ఉన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు ఏర్పాట్లు



భూపాలపల్లి అర్బన్: ఈనెల 7, 8 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలించి పోటీల ఏర్పాట్లపై ఏరియా అధికారులతో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఈ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు సుమారు 500 మంది స్విమ్మర్లు, సహాయక సిబ్బంది, కోచ్‌లు పాల్గొనే అవకాశం ఉందన్నారు. పోటీల్లో పాల్గొనే సభ్యులకు వసతులు కల్పించడానికి నిర్వాహకులు వసతి, ఇతర అవసరమైన ఏర్పాట్లు అందించడానికి ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కవీంద్ర, అధికారులు బాలరాజు, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కాటారం: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల హ్యాండ్‌బాల్ అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారు. నవంబర్ 8నుంచి 10వరకు హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 విభాగంలో ఉమ్మడి వరంగల్ జట్టు తరపున గురుకులం హ్యాండ్‌బాల్ అకాడమీ విద్యార్థులు చందర్, నరేశ్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వరంగల్ జట్టు తరపున గోల్డ్‌మెడల్ సైతం సాధించారు. దీంతో చందర్, నరేస్‌ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఈ నెల 11నుంచి 17వరకు పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల ప్రిన్సిపాల్ బి.లాలు, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేస్తూ అభినందించారు.

హామీలను నెరవేరుస్తున్నాం..

భూపాలపల్లి రూరల్: ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం భూపాలపల్లి బస్ డిపో మేనేజర్ ఇందూ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 మార్చిలో ప్రభుత్వం సుమారు వెయ్యి బస్సులు ప్రారంభించనుందన్నారు. కొత్త బస్సులను భూపాలపల్లి డిపోకు తీసుకువచ్చి తిరుపతి, బెంగళూరు వంటి దూరపు ప్రాంతాలను నడిపిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేను పలువురు అధికారులు, ఆర్టీసీ సిబ్బంది సన్మానించారు. అనంతరం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో డీఎంతోపాటు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులతో పాటు మెకానిక్‌లు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, దాట్ల శ్రీనివాస్, శిరుప అనిల్, ముంజాల రవీందర్ పాల్గొన్నారు.

హమాలీ డబ్బులు అందేనా?

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు
- రూ.4.43 కోట్లు పెండింగ్
- రైతులపై అదనపు భారం



ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు హమాలీ చార్జీలను చెల్లించడంలో జాప్యం చేస్తోంది. గడిచిన ఐదేళ్లుగా హమాలీ డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేసే హమాలీలు రైతుల నుంచి ముందస్తుగా హమాలీ చార్జీలను వసూలు చేసి తూకం వేస్తున్నారు. క్వింటాకు రైతుల నుంచి హమాలీలు రూ. 50నుంచి 55 తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు చేపట్టిన రైతులకు 5రూపాయల 10పైసలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయినప్పటికీ ఐదేళ్లుగా డబ్బులు చెల్లించకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

1.63లక్షల ఎకరాల్లో వరిపంట సాగు
జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో వరిసాగు రైతులు 52,348 మంది ఉన్నారు. 1.63లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నారు. ప్రతిఏటా ఖరీఫ్, రబీ సాగులో దాదాపుగా 2,70,344 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయీస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం ధాన్యం సేకరణ చేపడుతోంది.

2019నుంచి హమాలీ చార్జీల నిలిపివేత
రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేయడం, వాహనాల్లో లోడింగ్ చేయడానికి రైతులు హమాలీలకు ముందస్తుగా డబ్బులు చెల్లిస్తారు. రైతులపై హమాలీ డబ్బులు భారం పడకుండా ప్రభుత్వం క్వింటాకు రూ. 5.10 హమాలీ డబ్బులను విడుదల చేసేది. నిర్వాహకులు రైతులకు హమాలీ డబ్బులను చెల్లించేవారు. 2019–20 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం హమాలీ డబ్బుల చెల్లింపులు నిలిపి వేసింది. దీంతో రైతులపై అదనపు భారం పడుతుంది.

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సేకరణ
ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో గిరిజన, పీఏసీఎస్, మహిళా, రైతు సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల దాన్యాన్ని సేకరిస్తోంది. ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా సుమారుగా 204 కేంద్రాలకు ప్రతిపాదనలు రాగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో 135 కేంద్రాలు, జీసీసీ ఆధ్వర్యంలో 24 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 37 కేంద్రాలు, రైతుమిత్ర సంఘాల ఆధ్వర్యంలో 8 కేంద్రాలను కేటాయించారు. ప్రస్తుతం ఈ కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోంది.

ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డబ్బుల వివరాలు

సంవత్సరం	ధాన్యం సేకరణ మెట్రిక్ టన్నులు	హమాలీ డబ్బులు
ఖరీఫ్ 2019–20	1,65,167	రూ.84,23,517
రబీ	1,05,177	రూ.53,64,027
ఖరీఫ్ 2020–21	1,10,153	రూ.56,17,803
రబీ	1,00,404	రూ.51,20,604
ఖరీఫ్ 2021–22	1,40,473	రూ.71,64,123
రబీ	34,218	రూ.17,45,118
ఖరీఫ్2022–23	1,29,698	రూ.66,14,598
రబీ	67,916.640	రూ.36,33,540
ఖరీఫ్.2023–24	1,01,188.000	రూ.54,13,558

డబ్బులు వెంటనే చెల్లించాలి..



ధాన్యం సేకరణలో రైతులపై భారం పడకుండా హమాలీ డబ్బులను ప్రభుత్వమే భరించాలి. పెండింగ్‌లో ఉన్న హమాలీ డబ్బులను రైతులకు త్వరితగతిన అందించాలి. రైతులకు సాగు భారంతో పాటు హమాలీ డబ్బుల చెల్లింపు భారంగా మారుతోంది. రైతుల వద్ద నుంచి హమాలీలు క్వింటాకు రూ.55 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే హమాలీ డబ్బులను పెంచి సకాలంలో వెంటనే చెల్లించాలి.

- ఎండి.గఫూర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం నుంచి డబ్బులు రావడం లేదు..



రైతులకు ప్రభుత్వం గతంలో హమాలీ డబ్బులను క్వింటాకు రూ.5 చెల్లించేది. ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి హమాలీ డబ్బులు రావడం లేదు. రైతులకు రావాల్సిన హమాలీ డబ్బుల నివేదికలను ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే రైతులకు అందిస్తాం.

- రాంపతి, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్

రామప్పను సందర్శించిన నెదర్లాండ్ దేశస్తురాలు



నెదర్లాండ్ దేశస్తురాలికి ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ సాయినాథ్



ఎస్పీ కిరణ్ ఖరేకు శిల్పకళ గురించి వివరిస్తున్న గైడ్ వెంకటేశ్

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయాన్ని నెదర్లాండ్‌కు చెందిన ఏస్లీ స్లాట్స్ సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామిని ఆమె గురువారం దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే సైతం రామప్ప ఆలయాన్ని సందర్శించి రామప్ప రామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి నెదర్లాండ్ దేశస్తురాలికి టూరిజం గైడ్ సాయినాథ్ వివరించగా, ఎస్పీ కిరణ్ ఖరేకు గైడ్ తాడబోయిన వెంకటేశ్ వివరించారు. రామప్ప శిల్పకళ సంపద బాగుందని వారు కొనియాడారు.

‘మహాలక్ష్మి’తో కోట్ల రూపాయలు ఆదా..

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్



రవిచందర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

ములుగు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహా లక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు కోట్ల రూపాయల మేర ఆదా అయ్యాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ములుగు బస్టాండ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్–2 డిపో మేనేజర్ జోత్స్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయడానికి మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిందన్నారు. ఇప్పటి వరకు రూ.114.3 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం వినియోగించుకోవడం ద్వారా రూ.3856.40 కోట్ల రవాణా చార్జీలను ఆదా చేసుకున్నారన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క చొరవతో ఏటూరునాగారంలో బస్‌డిపో మంజూరు కావడమే కాకుండా జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బానోత్ రవిచందర్‌ను ఆర్టీసీ అధికారులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలను తహసీల్దార్ లక్ష్మీరాజయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

గణిత ప్రతిభ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ములుగు: తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) ములుగు మండలశాఖ అధ్యక్షుడు సుతారి మురళీధర్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి ఇనుగాల సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై పట్టుసాధిస్తే భవిష్యత్‌లో ఎలాంటి పోటీ పరీక్షలైనా సులభంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ఈ పరీక్షల్లో మొదటిస్థానంలో కృష్ణవంశీ(జెడ్పీహెచ్ఎస్, కోయగూడెం), శ్రావణి(జెడ్పీహెచ్ఎస్, దేవగిరిపట్నం), హిమవర్ష(జెడ్పీహెచ్ఎస్, పత్తిపల్లి), గణేశ్(జెడ్పీహెచ్ఎస్, బాలుర ములుగు), రిత్విక్(మోడల్‌స్కూల్, బండారుపల్లి) నిలిచారు. ద్వితీయస్థానంలో భవ్యశ్రీ(జెడ్పీహెచ్ఎస్, అబ్బాపూర్), రాజేశ్(జెడ్పీహెచ్ఎస్, మల్లంపల్లి) నిలిచారు. ఈ కార్యక్రమంలో గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ కందాల రామయ్య, హెచ్ఎం రాజేందర్, ములుగు మండల అధ్యక్షుడు పిట్టల మల్లయ్య, వెంకటశ్రీనివాస్, అరుణ, భారతి, అమీర్, రవీందర్, హమీద్ పాల్గొన్నారు.

రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లు

రైతుసంఘం జిల్లా కార్యదర్శి గఫూర్‌పాషా



మాట్లాడుతున్న గఫూర్ పాషా

ములుగు రూరల్: వరి ధాన్యం పండించిన రైతులను మిల్లర్లు నిలువు దోపిడీకి గురి చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి గఫూర్‌పాషా అన్నారు. మండల పరిధిలోని అంకన్నగూడెం ఏజెన్సీ ప్రాంతంలోని కొనుగోలు కేంద్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట కోసి ధాన్యం తరలించి 20 రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలలో కాంటాలు ప్రారంభం కాలేదన్నారు. అంకన్నగూడెంలో కొనుగోలు కేంద్రంలో రైతులు నిబంధనల మేరకు ధాన్యం తరలించినా ములుగులోని వైష్ణవి రైస్ మిల్లు యజమానులు క్వింటాకు 7 కిలోల చొప్పున కోత విధించారని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే బోనస్ ఆశించి సన్నధాన్యం సాగు చేస్తే దిగుబడి తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ధాన్యం కోతలకు పాల్పడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవిగౌడ్, శోభన్, రైతులు పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి

కాటారం: అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో కాటారం మండలం దామెరకుంట, గుండ్రాత్‌పల్లి, మల్లారం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్లను గురువారం డీఎఫ్ఓ పరిశీలించారు. ప్లాంటేషన్ విస్తీర్ణం, ఏఏ రకాల మొక్కలు నాటారు, మొక్కల పెంపకం కోసం తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్లాంటేషన్ల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అటవీ ప్రాంతంలో మొక్కల పెంపకం, అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడవుల అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అడవుల రక్షణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్త ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. డీఎఫ్ఓ వెంట కాటారం రేంజ్ అధికారిణి స్వాతి, డిప్యూటీ రేంజర్ సురేందర్‌నాయక్, ఎఫ్‌బీఓలు రాజ్‌కుమార్, జయలక్ష్మి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కలెక్టర్ టీఎస్.దివాకర



క్రీడాకారులతో కలెక్టర్ దివాకర

ములుగు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ దివాకర అన్నారు. జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో ప్రజా ప్రతి నిధులు, అధికారులకు క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 8 వరకు క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ రోజు ప్రజా ప్రతినిధులు, అధికారులకు క్రీడా పోటీలను నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఎం కప్ పోటీలు గ్రామ పంచాయతీల పరిధిలో 7, 8, మండల పరిధిలో 10 నుంచి 12 వరకు, జిల్లా స్థాయిలో 16 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో పాల్గొనే వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలని తెలిపారు. కబడ్డీ, హ్యాండ్‌బాల్, క్రికెట్ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల ఇన్‌చార్జ్ అధికారి తుల రవి, కబడ్డీ, క్రికెట్, హ్యాండ్‌బాల్ కోచ్‌లు జనార్దన్, సందీప్, కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు మల్లయ్య మృతదేహం పరిశీలన

ఏటూరునాగారం: ఈ నెల 1న చెల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడిన మావోయిస్టు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే మల్లయ్య మృతదేహాన్ని ఏటూరునాగారం పోస్టుమార్టం గదిలోనే భద్రపర్చాలని సోమవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మంగళ, గురువారాల్లో రెండు దఫాలుగా కోర్టులో కేసుపై వాదోపవాదనలు జరిగాయి. దాంతో మృతదేహాన్ని భద్రపర్చారు. మల్లయ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని, అతడిని చిత్ర హింసలు పెట్టి హత్య చేశారని బాధితురాలి న్యాయవాది కోర్టులో గట్టిగా వాదించారు. అయితే నిజనిర్ధారణ కోసం హైకోర్టుకు చెందిన న్యాయవాదులు మల్లయ్య మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు నేడు(శుక్రవారం) ఏటూరునాగారం చేరుకునే అవకాశం ఉంది. అలాగే మృతుడి శరీరంలో కేవలం ఒకే బుల్లెట్ ఉందని, శరీరంపై 11చోట్ల గాయాలున్నట్లు గుర్తించినట్లు బాధితురాలి న్యాయవాది తెలిపారు. అందరి సమక్షంలో మృతదేహాన్ని ఫొటోలు, వీడియోలు తీసి బాధితురాలికి అప్పగించే అవకాశం ఉందని సమాచారం.

పాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం భూపాలపల్లి మండలం కొంపెల్లి, గొర్లవీడు, కాసీంపల్లి, జంగేడు మీదుగా భూపాలపల్లి అంబేడ్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నిశిధర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని ఎమ్మెల్యే కేవలం శిలాఫలకాల వరకే పరిమితం చేశాడని ఆరోపించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి చంద్రయ్య



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి గుండబోయిన చంద్రయ్య అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ అధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని జరుపుకుంటుందని విమర్శించారు. రైతులకు రైతుభరోసా ఇవ్వక పోవడంతో పెట్టుబడికి నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు రుణమాఫీ సైతం పూర్తి స్థాయిలో చేయలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజన్న, జంగిలి సుధాకర్‌రావు, రవి, కొమురన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు మొగ్గు చూపాలి

డీఏఓ విజయభాస్కర్



మాట్లాడుతున్న భూపాలపల్లి జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్

రేగొండ : రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ, అధికారి విజయభాస్కర్ అన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని గురువారం మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాల వినియోగం ఎక్కువై పంట ఉత్పత్తుల ద్వారా ఆహారంలోకి చేరి మానవాళి ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. రైతులు అవలంబిస్తున్న సాగు విధానాలతో భూసారం క్షీణిస్తోందని చెప్పారు. నేల సహజ స్వభావాన్ని కోల్పోతుందన్నారు. రాబోయే తరాలకు ఆహారాన్ని అందించడానికి ఆరోగ్యకరమైన నేలను అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, మండల వ్యవసాయ అధికారి వాసుదేవ రెడ్డి, కోరమాండల్ కంపెనీ ప్రతినిధి సుమన్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిని గెంటేసిన కూతురు

న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లి రామక్క



నెల్లికుదురు: కడదాక కాపాడు తానని చెప్పి తల్లి వద్ద ఉన్న డబ్బు మొత్తం తీసుకున్న ఓ కూతురు.. మాట తప్పి తల్లిని ఇంటి నుంచి గెంటివేసింది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చిన్న ముప్పారంలో చోటు చేసుకుంది. బాధితురాలు, తల్లి పాదిల రామక్క కథనం ప్రకారం.. రామక్కకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. వృద్ధాప్యంలో ఉన్న రామక్క తన వద్ద డబ్బులన్నీ కొడుకుల సమక్షంలో తన కూతురు ముదిరికోల్ల ధనమ్మకు అప్పగించి తాను కూతురు వద్దనే ఉంటానని తెలిపింది. ఇన్ని రోజులు కాలం గడిచిందని, ఇప్పుడు నీకు, నాకు ఎలాంటి సంబంధం లేదని ఇంటి నుంచి వెళ్లిపోవాలని తల్లి రామక్కను కూతురు ఇంటి నుంచి వెళ్లగొట్టింది. దీంతో బాధితురాల తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మావోయిస్టు జైసింగ్ మృతదేహం అప్పగింత

ఏటూరునాగారం: చెల్పాక అడవుల్లో ఈనెల 1న జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో మృతి చెందిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి కుసునూరుకు చెందిన మావోయిస్టు కమిటీ సభ్యుడు జైసింగ్ మృతదేహాన్ని గురువారం తల్లి పొట్టెం సన్ని, సోదరుడు పొట్టెం లక్ష్మణ్‌కు అప్పగించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత మృతుడి వివరాలను కుటుంబ సభ్యులకు తెలిపినప్పటికీ ఆలస్యంగా రావడంతో మంగపేట ఎస్సై సూరి, మరో ఎస్సై సురేష్ ఆధ్వర్యాన అప్పగించారు.

నేడు మధు మృతదేహం తరలింపు

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏగొలపు మల్లయ్య అలియాస్ మధు మృతదేహాన్ని శుక్రవారం తీసుకువెళ్లనున్నట్లు అతడి భార్య మీనా తెలిపారు. హైకోర్టు పిటిషనర్ న్యాయవాది, ప్రభుత్వాధికారి, తహసీల్దార్, బంధువుల సమక్షంలో మృతదేహాన్ని పరిశీలించి భార్యకు అప్పగించనున్నారు. మధు దహన సంస్కారాల అనంతరం కోర్టులో విచారణ చేయనున్నట్లు సమాచారం.

గృహప్రవేశం చేసిన మరునాడే మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- నర్సింహులగూడెంలో ఘటన



నర్సయ్య (ఫైల్)

నెల్లికుదురు: గృహ ప్రవేశం చేసిన మరునాడే ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరాడు. విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెదగోని నర్సయ్య (45) ఈ నెల 4న గృహ ప్రవేశం చేశాడు. అద్దె ఇంట్లో ఉన్న సామాన్లు నూతన గృహంలోకి తరలిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై కిందపడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నర్సయ్య మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు.

పుల్లూరులో రైతు..



లాలు (ఫైల్)

గార్ల: వ్యవసాయ బావి వద్ద మోటార్‌కు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై బావిలో పడి ఓ గిరిజన రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం గార్ల మండలం పుల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బోటితండాకు చెందిన కొర్ర లాలు(55)కు మానుకోట జిల్లా గార్ల మండలం పుల్లూరు పంచాయతీలో వ్యవసాయ భూమి ఉంది. మిరప తోటకు నీళ్లు కట్టేందుకు మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా మరమ్మతుకు గురైంది. దీంతో మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య అచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటల్లో ఆణిముత్యాలు

మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్, వార్డెన్ వీరమ్మ

- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం

నల్లబెల్లి: క్రీడల సాధనకు అనువైన ప్రాంగణం.. ఆటలపై ఆసక్తి ఉన్న బాలికలకు మెళకువలు నేర్పించేందుకు అనుభవం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. వారి ప్రోత్సాహంతో ప్రణాళికాబద్ధంగా చదువుతోపాటు క్రీడల్లో సత్తా చాటుతూ ముందుకు సాగుతున్నారు. దీంతో క్రీడాపోటీలు ఎక్కడ జరిగినా ప్రతిభకనబరిచి పతకాలు సాధిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మరింత సహకారం అందిస్తే అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు మండలంలోని మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు..

క్రీడలు, చదువుకు సమ ప్రాధాన్యం..

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతోపాటు అథ్లెటిక్స్‌లోనూ విద్యార్థినులు రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థినులు సాధన చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. భవిష్యత్‌లో మరింత రాణిస్తామని విద్యార్థినులు చెబుతున్నారు.

కబడ్డీలో పట్టు సాధించిన నాగేశ్వరి



పర్వతగిరి మండలంలోని పంచరాయితండాకు చెందిన రైతు బానోత్ వెంకన్న–భారతి దంపతుల కుమార్తె నాగేశ్వరి. తల్లిదండ్రులు మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల పాఠశాలలో ఆమెను ఐదో తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పదో తరగతి చదువుతోంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కబడ్డీలో నిత్యం సాధన చేస్తోంది. మెళకువలు నేర్చుకుని నాగేశ్వరి పట్టు సాధించింది. గత నెల 5, 6, 7 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. అంతేకాకుండా గతంలో ఏటూరునాగారంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, భద్రాచలంలోని కిన్నెరసానిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది.

అంతర్జాతీయ పోటీలకు శిక్షణ..



బానోత్ రాజేశ్వరి మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తోంది. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వాలీబాల్ పోటీల్లో రాణించేందుకు నిరంతరం సాధన చేస్తోంది. ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా పాఠశాలలో శిక్షణ పొందుతోంది. చదువును ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఆటల్లో రాణిస్తోంది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ..



నర్సంపేట మండలంలోని పర్శనాయక్ తండాకు చెందిన కొర్ర శ్రీను కుమార్తె శ్రుతి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. విజయం సాధించాలనే లక్ష్యంతో బరిలో దిగుతుంది. మెదక్‌లో జరిగిన అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయిలో విజయం సాధించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం శిక్షణ తీసుకుంటోంది.

విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నాం..




విద్యార్థినులకు క్రీడల్లో ఆసక్తి పెంచేలా ప్రోత్సహిస్తున్నాం. వారిలోని ప్రతిభ ఆధారంగా క్రీడల్లో మెళకువలు నేర్పిస్తున్నాం. మెరుగైన శిక్షణను అందించి జాతీయస్థాయిలో పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం. ఇప్పటికే విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

– బానోత్ దేవీలాల్, పీడీ

అభివృద్ధి దిశగా ఉర్సు గుట్ట

- ఫోర్ షోర్డ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉర్సుగుట్ట లేక్‌లో కదలిక
- మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో ముందుకెళ్లనున్న ప్రాజెక్టు
- రూ.14.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమైతే మరో టూరిస్ట్ స్పాట్



సాక్షి, వరంగల్: పర్యాటక ప్రాంతంగా ఉర్సుగుట్ట అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. స్మార్ట్ సిటీలో భాగంగా ఐదేళ్ల క్రితం ఈ చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు. టెండర్ వరకు వచ్చి ఆగడంతో మళ్లీ దీనిని పట్టించుకునేవారు లేక పోవడంతో అటకెక్కింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో రూ.14.50 కోట్ల అంచనాతో రూపొందించిన 'ఫోర్ షోర్డ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉర్సుగుట్ట లేక్' పనులపై వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ దృష్టి సారించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు ముందుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అధికారులు కూడా పూర్తిస్థాయిలో నివేదికను సిద్ధం చేసినట్లు తెలిసింది.

సకల సౌకర్యాలతో అభివృద్ధి ఇలా..

ఉర్సుగుట్ట చెరువు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనికి రెండువైపులా బండ్ సుందరంగా తీర్చిదిద్దే అవకాశముంది. ఇంకోవైపు స్టేట్ హైవే ఉండడం, మరో వైపు ఓపెన్ బండ్ ఉండడం వల్ల పనులకు కాస్త ఇబ్బందిగా పరిణమించనుంది. అయితే అవకాశమున్న చోట మాత్రమే బండ్‌ను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. చెరువుకు 750 మీటర్ల పొడవున్న ఆరుమీటర్ల వెడల్పుతో సైక్లింగ్ ట్రాక్, 1700 మీటర్ల పొడవున్న వైపు మూడు మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్‌తోపాటు పర్యాటకులు కూర్చునేలా సరికొత్త హంగులతో సిట్టింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ఉర్సుగుట్ట పక్కనే ఓపెన్ జిమ్ ఏర్పాటుచేయడం కూడా నగరవాసుల ఆరోగ్యానికి ఉపయోగపడనుంది. అక్కడే ఉన్న మైదానంలో పిల్లలు క్రికెట్, పెద్దలు వాలీబాల్ ఆడుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. నడిచేందుకు టైల్స్, రాత్రివేళ కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైట్లు అమర్చనున్నారు. అలాగే బతుకమ్మ, వినాయక నిమజ్జన పాయింట్లు ఉన్న ప్రాంతంలో కెఫెటేరియా నిర్మించనున్నారు. దిమ్మెలపై టెంట్ ఆకారంతో ఏర్పాటుచేసే కుర్చీల్లో కూర్చొని సరస్సులోని అలలను చూస్తూ.. ఇష్టమైన ఆహారం తీసుకుంటూ కుటుంబంతో సరదాగా గడిపేలా ప్రణాళికలు రూపొందించారు. అలాగే, మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలకు సైన్స్ పార్కు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రాజెక్టు పనులు మొదలైతే ఏడాదిన్నరలోపు పూర్తయ్యే అవకాశముంటుందని బల్దియా ఇంజనీరింగ్ విభాగాధికారి ఒకరు తెలిపారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



బాలు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అప్పుల బాధతో ఓ రైతు గడ్డి మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేవుల తండా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ బాలు (55)కు 1.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది ఎకరం మిర్చి సాగు చేయగా అప్పులు కావడంతో పాటు దిగుబడిరాక ఆర్థికంగా నష్టపోయాడు. బ్యాంకులో రూ.2 లక్షలు, ఇతరుల వద్ద రూ.లక్ష.. మొత్తం 3 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ ఏడాది మొక్కజొన్న సాగుచేశాడు. దిగుబడి వస్తుందో.. రాదోనని మనోవేదనకు గురయ్యాడు. దీంతో బుధవారం సాయంత్రం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

పట్టపగలు.. రెండు ఇళ్లలో చోరీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దొంగలు పట్టపగలే రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. అనంతరం మరో ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మానుకోట జిల్లా కేంద్రంలోని మల్లం బజార్‌కు చెందిన మహేందర్, స్రవంతి దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో దొంగలు ఇంటి తలుపు తాళం తొలగించి ఆరు బంగారు లక్ష్మీదేవి కాయిన్లు, రూ. ఆరు వేల నగదు అపహరించుకెళ్లారు. అనంతరం బెస్త బజార్‌కు చెందిన జంగిలి హరీశ్ ఇంట్లో ఏడు తులాల వెండి, ముప్పావు తులం బంగారు ఆభరణాలు, రూ. ఆరు వేల నగదు అపహరించారు. అక్కడి నుంచి పక్కన ఉన్న దుగ్గి పూలమ్మ ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. ఇక్కడ నగదు లభించలేదు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, ఫింగర్ ప్రింట్ బృందంతో కలిసి ఘటన స్థలాలకు చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు.



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్ బృందం

సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతం

- నేడు ముగియనున్న రైల్వే ఎలక్షన్లు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో బుధవారం ప్రారంభమైన 'రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్' సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. వివిధ రైల్వే డిపోలు, కార్యాలయాలు, షెడ్లలో పని చేస్తున్న రైల్వే విభాగాల కార్మికులు తరలివచ్చి ఓటు వేశారని రైల్వే జనరల్ బ్రాంచ్ చైర్మన్ డి.శ్రీనివాస్‌యాదవ్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముగింపు రోజు రన్నింగ్ స్టాఫ్ లోకోపైలెట్లకు ఎన్నికలు ఉంటాయన్నారు. జమ్మికుంట రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ చైర్మన్ వి.రాజయ్య, సెక్రటరీ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటర్లు అయిన కార్మికులకు కాజీపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్ వివరాలు తెలిపి పోల్ చీటీలు పంపిణీ చేశారు.

పోలింగ్ శాతం

ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి తెలిపారు. ఇందులో డీజిల్‌షెడ్ పోలింగ్ కేంద్రం–13లో 287, ఎలక్ట్రిక్‌షెడ్ పోలింగ్ కేంద్రం–14లో 174, రైల్వే ట్రెనింగ్ స్కూల్ సెంటర్ పోలింగ్ కేంద్రం–37లో 280, డివిజనల్ ట్రెనింగ్ సెంటర్ పోలింగ్ కేంద్రం–11లో 188, డివిజనల్ ట్రెనింగ్ సెంటర్ పోలింగ్ కేంద్రం–12లో 309 ఓట్లు పోలయ్యాయని చెప్పారు.




కాజీపేట రైల్వే ఎన్నికల శిబిరం వద్ద నాయకులు


రేపటి నుంచి వార్షిక సమావేశం

కేయూ క్యాంపస్: ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సమావేశాన్ని ఈనెల 7 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోషల్ సైన్స్ డీన్, లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ టి.మనోహర్, ఆ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనాల ద్వారా వాస్తవిక చరిత్రను వెలికి తీయడంపై ఈకాన్ఫరెన్స్‌లో చర్చ ఉంటుందని తెలిపారు. ఈప్రారంభ సమావేశాన్ని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. మైసూర్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్‌ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ స్వామినాథన్, యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా యన్సియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ఆచార్య సుస్మిత బసు మజుందార్, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్‌లాల్ పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

భార్య మరణించిన మూడు రోజులకే..

- తనువు చాలించిన భర్త





సంజీవరావు, భాగ్యమ్మ(ఫైల్)

దుగ్గొండి/ ఖిలావరంగల్: జీవితం చివరి అంకానికి చేరింది.. వృద్ధాప్యం మీద పడింది.. నిత్యం సేవలందిస్తూ సపర్యలు చేసే భార్య మృతి చెందింది.. కడుపున పుట్టినవారు ఖండాంతరాల్లో ఉన్నారు. ఇక తాను ఉండలేనంటూ గ్రామస్తులతో చెప్పిన భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లిలో చోటుచేసుకుంది. బంధంపల్లికి చెందిన పల్లం సంజీవరావు(72) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ 2010లో రిటైర్డ్ అయ్యాడు. అప్పటికే మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నా ఆమె విడాకులు తీసుకుని వెళ్లి పోయింది. రెండో పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్న క్రమంలో ఆమె మృతి చెందింది. మళ్లీ మూడేళ్ల క్రితం వంగరి భాగ్యమ్మ మూడో పెళ్లి చేసుకున్నాడు. ఆమె మూడు రోజుల క్రితం ఇంట్లోనే మృతి చెందింది. అంత్యక్రియల అనంతరం బంధువులంతా బుధవారం వెళ్లిపోయారు. సంజీవరావు మాత్రమే మిగిలారు. ఇక తనకు ఎవరూ తోడులేరని గురువారం తెల్లవారుజామున బయటకు వెళ్లి వరంగల్ సమీపంలోని ధర్మారం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

30 ఏళ్లకు వచ్చి తలకొరివి పెట్టి..

సంజీవరావు మొదటి భార్యకు ఇద్దరు కుమారులున్నారు. ఆమె విడాకులిచ్చిన తర్వాత వారితో సంబంధం తెగింది. తర్వాత రెండు వివాహాలు చేసుకోగా వారికి సంతానం లేదు. మొదటి భార్య పెద్ద కుమారుడు ప్రవీణ్ ములుగు జిల్లా కేంద్రంలో, రెండో కుమారుడు అరుణ్ అమెరికాలో స్థిరపడ్డారు. సంజీవరావు మృతి సమాచారాన్ని ప్రవీణ్‌కు అందించి సర్దిచెప్పగా తలకొరివి పెట్టడానికి ఒప్పుకున్నాడు.

సేంద్రియ పంటలతోనే నేల సారవంతం



మృత్తిక దినోత్సవంలో రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు

వరంగల్ : సేంద్రియ పంటలతోనే నేల సారవంతమవుతుందని వరంగల్ నాబార్డ్ సీజీఎం ఎల్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఆరెపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు వరంగల్ ఆర్థిక సాయంతో రైతులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి కావాల్సిన సేంద్రియ పంటలు పండించాలన్నారు. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట, ఎరువులు, విత్తనాలను పండించడానికి కావాల్సిన ఆర్థిక సాయాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నాబార్డు అందిస్తుందన్నారు. మృత్తిక శాస్త్రవేత్త, పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ భూమిపై మానవ జీవితం ఆరోగ్యకర నేలలపై ఆధారపడి ఉంటుందన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణలో అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కాలేజ్ వరంగల్ డీన్ వెంకట్‌రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్, శిక్షణ నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్.రాములు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు

- నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్
- 'సుమతిరెడ్డి'లో అభిజ్ఞాన్ 3.0 వేడుకలు షురూ



ఆనంద్ కిశోర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారు ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న అభిజ్ఞాన్ 3.0 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ఆనంద్ కిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులు వెలికితీయొచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా బెంగళూరుకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ రూపక్ వోలేటి ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలపై ప్రయోగాత్మకంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఈఈఈ అడ్వైజర్ మూల రాము, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏట వేణుగోపాలస్వామి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందించడంలో సీసీఐ విఫలం

- రైతు కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



పత్తి యార్డులో ధర గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న కోదండరెడ్డి

వరంగల్: పత్తి రైతులకు మద్దతు ధర అందించడంలో సీసీఐ విఫలమైందని, ఈవిషయాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని రైతు కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. గురువారం ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు కెవిఎన్.రెడ్డి, సునీల్, భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీసీఐ మార్కెట్‌కి వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కాగా, గోనె సంచుల్లో ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం, సీసీఐపై ఒత్తిడి చేస్తామని రైతులకు కోదండరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి పి.నిర్మల అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఐ లాభాల్లో ఉందని, రైతులను నష్టాల్లో పడేయడం సరికాదన్నారు. ఎంఎస్‌పీ ప్రకారం ప్రతి రైతు దగ్గర పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనం..

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయాన్ని గురువారం రైతు వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు.. కోదండరెడ్డికి తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

మట్టెవాడ పోలీసుల అదుపులో హత్య నిందితుడు?

రామన్నపేట : వరంగల్ నగరంలోని రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని హత్య చేసిన నిందితుడిని మట్టెవాడ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలపై విచారణ చేపడుతున్నారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి రాజమోహన్ (62) తన శరీరంపై నిత్యం పెద్ద ఎత్తున బంగారం వేసుకుని తిరగడంతో బంగారంపై కన్ను వేసి హత్య చేశాడా..? ఏమైనా ఆర్థిక లావాదేవీల కోసం హత్య చేశాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.20 లక్షల విలువైన ఆభరణాలు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగ తనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 27న కాటారం మండలం శంకరంపల్లిలో దొంగతనం జరగ్గా బాధితుల ఫిర్యాదు మేరకు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు ఆధ్వర్యాన మూడు టీంలు విచారణ ప్రారంభించి సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు చెప్పారు. మంచిర్యాలకు చెందిన తాటికొండ స్వామి, ఆసిఫాబాద్ జిల్లా తిర్యానికి చెందిన కూరాసేనగా ఈశ్వర్, మహారాష్ట్ర సిరొంచకు చెందిన పనేం రాజేష్.. మహారాష్ట్రలోని చంద్రాపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, గణపురం మండలం చెల్పూర్, కొయ్యూర్, హనుమకొండ జిల్లాలోని సుబేదారి, పెద్దపల్లి జిల్లాలోని మంథని, గుంజమడుగు, ములుగు జిల్లాలోని పస్రా ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల పస్రాలో దొంగిలించిన బంగారం, రెండు బైకులను విక్రయించడానికి వెళ్తుండగా బుధవారం కాటారం మండల పరిధీ మద్దులపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందింతుల నుంచి 17.3 తులాల బంగారం, 83 తులాల వెండి ఆభరణాలు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక ఎల్‌ఈడీ టీవీ, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కిరణ్‌ఖరే వివరించారు.